క్లుప్తంగా

ముగిసిన అఖండ భజన



పూజలో పాల్గొన్న భక్తులు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లిలో నిర్వహిస్తున్న వంద గంటల అఖండ భజన కార్యక్రమం సోమవారం ముగిసింది. వంద గంటల అఖండ భజనలో 108జంటలు పాల్గొని సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి అధ్యక్షుడు వెంకట్రావు, జెడ్పీ మాజీవైస్ చైర్మన్ రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

నేడు హెల్త్ క్యాంప్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫీసర్స్ క్లబ్‌లో మంగళవారం ఉదయం 9గంటలకు ఈ క్యాంపు ప్రారంభమవుతుందన్నారు. బీపీ, బ్లడ్ షుగర్, బ్రెస్ట్ క్యాన్సర్ సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. నిష్ణాతులైన వైద్య బృందం ఇందులో పాల్గొంటుందని పేర్కొన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

5న వామపక్ష పార్టీల నిరసన

పాతమంచిర్యాల: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 5న జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి టీ.శ్రీనివాస్ సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, నాయకులు పాల్గొన్నారు.

సదరం వైద్య శిబిరాలు

పాతమంచిర్యాల: ఈ నెల 5 నుంచి మంచిర్యాల జనరల్ ఆస్పత్రిలో నిర్వహించే సదరం వైద్య శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎస్.కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవా కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకుని నిర్దేశిత తేదీల్లో హాజరు కావాలని పేర్కొన్నారు. నేటి నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ అవకాశాన్ని కల్పించామని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



భీమారం: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భీమారం/లక్సెట్టిపేట/చెన్నూర్‌రూరల్/మందమర్రిరూరల్/జైపూర్: ఏబీసీడీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'వేల గొంతుకలు–లక్ష డప్పులు' సభ నిర్వహిస్తున్నారు. సభకు సంబంధించిన పోస్టర్లను సోమవారం భీమారం, లక్సెట్టిపేట, చెన్నూర్, మందమర్రి, జైపూర్ మండలాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. విజయవంతం చేయాలని కోరారు.

జీఎంను కలిసిన కమిషనర్

మందమర్రిరూరల్: ఏరియా జీఎం ఆఫీస్‌లో సోమవారం జీఎం దేవేందర్‌ను మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను వివరించి అభివృద్ధికి సహకరించాలని జీఎంను కోరినట్లు తెలిపారు.

ఘనంగా వసంత పంచమి



చెన్నూర్ శివాలయంలో చిన్నారుల అక్షరాభ్యాసం



మందమర్రిరూరల్: సామూహిక అక్షరాభ్యాసం



తాండూర్: వేడుకల్లో పాల్గొన్న వాసవి క్లబ్‌నిర్వాహకులు, చిన్నారులు



జన్నారం మండలం రోటిగూడలో పూజలు చేస్తున్న చిన్నారులు

జన్నారం/చెన్నూర్‌రూరల్/భీమారం/మంచిర్యాలటౌన్/దండేపల్లి/మందమర్రిరూరల్/తాండూర్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చదువులతల్లి సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి చిన్నారులకు పూజారులు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో భాగంగా ఓనమాలు దిద్దించారు.



భీమారం: అక్షరాభ్యాసం చేయిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, ఎంపీడీవో మధుసూదన్



దండేపల్లి: అక్షరాభ్యాసం చేయిస్తూ..



జిల్లా కేంద్రంలోని మజీద్‌వాడ అంగన్‌వాడీ కేంద్రంలో..



జిల్లా కేంద్రంలోని ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రంలో



భీమారం: కోదండరామాలయంలో...



చెన్నూర్‌రూరల్: అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లులు

ప్రతిపాదనలకే పరిమితం!

- బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఇరుకుగా అంతర్గత రోడ్లు
- మూడు ప్రాంతాల్లో విస్తరించాలని గతంలోనే ప్రతిపాదనలు
- ఇప్పటికీ ముందుకు సాగని పనులు
- భవిష్యత్తు అవసరాలపై దృష్టి సారించని అధికారులు



ఇరుకుగా అంబేడ్కర్ నగర్ రోడ్డు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో అంతర్గత ప్రధాన రహదారుల విస్తరణ ఏళ్లు గడుస్తున్నా చేపట్టడం లేదు. పాలకుల నిర్లిప్తత, అధికారుల నిర్లక్ష్యంతో రోడ్ల వెడల్పు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా తయారైంది. భవిష్యత్ అవసరాలను గుర్తించి రోడ్ల వెడల్పు చేయాల్సి ఉన్నా ఆ దిశగా అడుగులు పడటం లేదు. ప్రధాన రోడ్ల విస్తరణపై పట్టింపు లేకుండా వ్యవహరిస్తుండటంతో పురప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

నిధులు మంజూరైనా నిర్లక్ష్యమే..

రోడ్డు వెడల్పు చేసి కొత్తగా రహదారులను నిర్మించడానికి మున్సిపాలిటీకి నిధులు మంజూరైనా లెక్కచేయడం లేదు. దాదాపు 8ఏళ్ల నుంచి అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలనే సంకల్పం అధికారుల్లో, పాలకుల్లో కానరాకుండా పోవడం శాపంగా మారుతోంది. ఎక్కడైనా నిధులు మంజూరు కాకుండా పనులు జరగని పరిస్థితులు ఉన్నాయి కానీ మున్సిపాలిటీలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు ఉండటం విడ్డూరంగా ఉందని పుర ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్లను వెడల్పు చేయడం వల్ల ఆయా ప్రాంతాల ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది.

రాకపోకలకు ఇబ్బందులు..

ప్రతిపాదిత రోడ్లు ఎంతో ముఖ్యమైనవి. బుధాకుర్థు, కాసిరెడ్డిపల్లి, చాకేపల్లి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే అంబేడ్కర్‌నగర్ రోడ్డు అదే తీరుగా నెన్నెల, భీమిని, వేమనపల్లి, కన్నెపల్లి, దహెగాం మండలాల్లోని గ్రామీణ ప్రాంతాలతో పాటు బెల్లంపల్లి మండలంలోని సగానికి పైగా గ్రామాలకు వెళ్లే బెల్లంపల్లి బస్తీ రోడ్డు, యూనియన్(ఆంధ్రాబ్యాంక్) ముందు నుంచి షంషీర్‌నగర్‌కు వెళ్లే రోడ్ల మీదుగా రోజువారీగా వందలాది వాహనాలు, ప్రజలు విరామం లేకుండా రాకపోకలు సాగిస్తుంటారు. అంతటి ముఖ్యమైన రోడ్లు ఇరుకిరుకుగా ఉండటంతో ఒకేసారి రెండు వాహనాలు ఎదురెదురు పడిన వెళ్లడానికి ఇబ్బందికరమైన పరిస్థితులు ఉంటున్నాయి. ఒక్కోసారి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఆటోలు, బైక్‌లు, ట్రాలీలు, ట్రాక్టర్ల రవాణా అధికంగా ఉండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అత్యవసరంగా వెళ్లలేని పరిస్థితులు ఉంటున్నాయి. ప్రజలు, వాహనదారుల ఇక్కట్లను దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ అధికారులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా రోడ్ల విస్తరణ చేపట్టాలని పురప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై 'సాక్షి' మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావును ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

కొలతలు తీసి.. మార్కింగ్ చేసి

మున్సిపాలిటీలో మూడు ప్రాంతాల్లో రోడ్లను విస్తరించాలని 2017– 18 ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదనలు చేశారు. పాత బస్టాండ్ వద్ద నుంచి అంబేడ్కర్ నగర్‌కు వెళ్లే ప్రధాన అంతర్గత రహదారి, భగత్‌సింగ్ చౌరస్తా నుంచి షంషీర్‌నగర్‌కు వెళ్లే రోడ్డు, అంబేడ్కర్(కాంటా) చౌరస్తా నుంచి బెల్లంపల్లి బస్తీ మీదుగా పోచమ్మ గడ్డ చౌరస్తాకు వెళ్లే రోడ్లను వెడల్పు చేయాలని మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా కొలతలు తీసి మార్కింగ్ చేశారు. త్వరగా రోడ్లను విస్తరించి వాహనదారులు, ప్రజలకు ఇ బ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని అప్పట్లో హడావుడి చేశారు. కానీ రోడ్ల విస్తరణ కోసం చేసిన ప్రతిపాదనలు నేటికీ కార్యరూపం దాల్చకపోవడం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తోంది.

రోడ్లు విస్తరించాలి



పెరుగుతున్న జనాభా, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదిత రోడ్లను విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏళ్ల క్రితం చేసిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చకపోవడం మున్సిపల్ అధికారులు, పాలకుల అసమర్థతకు నిదర్శనంగా నిలుస్తోంది. ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా విధిగా రోడ్లను వెడల్పు చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. ఆయా ప్రాంతాల ప్రజలతో మాట్లాడి సానుకూల నిర్ణయం తీసుకోవాలి.

– కటకం సతీష్‌కుమార్, మాజీ కౌన్సిలర్

నిర్లక్ష్యం చేయొద్దు



రోడ్లను వెడల్పు చేస్తామని ఏళ్ల క్రితం తీర్మానం చేశారు. ఆలస్యం చేయకుండా చర్యలు ప్రారంభిస్తామని ఇళ్లకు మార్కింగ్ చేశారు. ఏ కారణంగానో అంతే వేగంగా రోడ్డు వెడల్పు పనులను పక్కన పెట్టారు. రోడ్లు ఇరుకిరుకుగా ఉండటం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు కలుగుతున్నాయి. అత్యవసరంగా వెళ్లడానికి ప్రజలు, వాహనదారులు తిప్పలు పడాల్సి వస్తోంది. ఇక్కట్లు కలగకుండా చర్యలు తీసుకోవాలి.

– ఏ.బాపు, బీకేఎంయూ నాయకుడు

'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం'



రామకృష్ణాపూర్: నిరసన తెలుపుతున్న నాయకులు



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామకృష్ణాపూర్/జన్నారం/చెన్నూర్‌రూరల్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని పేర్కొంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పార్టీ పిలుపుమేరకు రామకృష్ణాపూర్, జన్నారం, చెన్నూర్ మండలాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మోదీ, నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. లోటు బడ్జెట్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రులను పలుమార్లు కలిసి విన్నవించినప్పటికీ, బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించకపోవటం సరికాదన్నారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరిగినా బీజేపీ ఎంపీలు పార్లమెంట్‌లో బల్లలు చరిచిన తీరు తెలంగాణ సమాజాన్ని సిగ్గుపడేలా చేస్తుందని మండిపడ్డారు. ఆయా కార్యక్రమాల్లో రామకృష్ణాపూర్‌లో టీపీసీసీ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వొడ్నాల శ్రీనివాస్, గోపతిరాజయ్య, గాండ్ల సమ్మయ్య, కనకరాజు, వేణు, సుధాకర్, జన్నారంలో ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్ రెడ్డి, ఇసాక్, టౌన్ ప్రెసిడెంట్ దూమల్ల రమేశ్, మచ్చా శంకరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, డైరెక్టర్లు రేగుంట ప్రదీప్, ముత్యం రాజన్న, సత్తన్న, తిరుపతి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మామిడిపెల్లి ఇందయ్య, చెన్నూర్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజ్జెల అంకాగౌడ్, కోటపల్లి, చెన్నూర్ మండలాల నాయకులు పాల్గొన్నారు.

భీమారం/జైపూర్/మందమర్రిరూరల్: కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చెయ్యి చూపినందుకు నిరసనగా సోమవారం మంచిర్యాల–చెన్నూర్ జాతీయరహదారిపై భీమారం వద్ద, జైపూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ధర్నా నిర్వహించారు. మందమర్రి సింగరేణి హైస్కూల్ ఎదుట గల అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో భీమారంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పొడేటి రవి, మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి మోహన్ రెడ్డి, భీమారం మాజీ సర్పంచ్ గద్దె రాంరెడ్డి, నాయకులు బుక్యా లక్ష్మణ్, ప్రకాశ్, కొమ్ము శ్రీనివాస్, జైపూర్‌లో కాంగ్రెస్ నాయకులు చల్ల విశ్వంభర్‌రెడ్డి, అంబల్ల రవీందర్‌రెడ్డి, శీలం వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అంబల్ల సంపత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సయ్య, మందమర్రిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీదేవర బోనాలు



శోభాయాత్రగా దేవరలతో వెళ్తున్న భక్తులు

చెన్నూర్‌రూరల్: లక్ష్మీదేవర బోనాలు సోమవారం చెన్నూర్ పట్టణంలో ముదిరాజ్‌లు ఘనంగా నిర్వహించారు. బట్టిగూడెం, పాత బస్టాండ్, ముదిరాజ్ కాలనీల్లోని లక్ష్మీదేవర ఆలయం వద్ద మహిళలు బోనాలు పోసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శోభాయాత్ర నిర్వహించారు.



లక్ష్మీదేవర వద్ద...



బోనాలతో భక్తులు

సంక్షిప్త వార్తలు

ప్రభుత్వ కళాశాలలో చేరికలపై అవగాహన

కోటపల్లి: ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వ కళాశాల ఉపాధ్యాయులు సోమవారం పార్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బీజేపీ నాయకుల సంబురాలు

చెన్నూర్‌రూరల్: బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ నియామకంపై సంతోషం వ్యక్తం చేస్తూ స్థానిక బీజేపీ నాయకులు సోమవారం పాత బస్టాండ్ వద్ద స్వీట్లు పంచిపెట్టి సంబురాలు జరుపుకున్నారు.

క్రాప్ డిజిటల్ సర్వే

లక్సెట్టిపేట: మండలంలోని బలరావుపేట, వెంకట్రావుపేట, దౌడపల్లి, లక్ష్మిపూర్, ఇటిక్యాల గ్రామాలు డిజిటల్ సర్వేకు ఎంపిక కాగా సోమవారం సర్వే ప్రారంభించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థిని అభివర్థిని (8వ తరగతి) రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థినిని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య సోమవారం సత్కరించినట్లు తెలిపారు.

'టీచర్ల సమస్యలపై పోరాటం'

నస్పూర్: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే టీచర్ల సమస్యలపై పోరాడి పరిష్కారానికి కృషి చేస్తానని టీఎస్‌సీపీఎస్‌ఈయూ (తెలంగాణ రాష్ట్ర కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయి యూనియన్) ఎమ్మెల్సీ అభ్యర్థి తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి తెలిపారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాత పింఛన్ విధానం అమలు పర్చేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌లోని అంబేడ్కర్ చౌక్‌లో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేయడంపై బీజేపీ నాయకులు కాంగ్రెస్ నాయకులపై చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా అధికార పార్టీ అని దురహంకారంతో ఇలా చేయడం సరికాదన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని పీఆర్‌టీయూ టీఎస్ ఎంఎల్‌సీ మహేందర్‌రెడ్డి అన్నారు. మంచిర్యాల పీఆర్‌టీయూ భవనంను సోమవారం ఆయన ప్రారంభించారు. ఎంఎల్‌సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డి, శశిధర్ శర్మ, శంకర్, మోహన్‌రావులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

వడ్డీ డబ్బుల రికవరీ నిలిపివేయాలి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు సంబంధించిన హెచ్‌బీఎల్‌ఆర్‌ఎస్(ఇంటి రుణంపై వడ్డీ) సంబంధించిన ఇంటి రుణ వడ్డీ ఎక్కువ చెల్లించామని కారణంతో యజమాన్యం కార్మికుల నుంచి తిరిగి రికవరీ చేయడాన్ని నిలిపివేయాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, సహాయ కార్యదర్శి కొమురయ్య, ఉపాధ్యక్షుడు కిషన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కార్మికులు తీసుకున్న రూ.10లక్షల లోపు ఇంటి రుణంపై వడ్డీని ప్రతీ నెల చెల్లిస్తుందని, కాని కరోనా సమయంలో కంపెనీ ఎక్కువ వడ్డీ చెల్లించిందనే కారణంతో తిరిగి కార్మికుల నుంచి రికవరీ చేయడానికి ఇచ్చిన ఉత్తర్వులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఆర్టీఐ యాక్ట్‌పై శిక్షణకు రిటైర్డ్ ఉద్యోగులు

శ్రీరాంపూర్: సమాచార హక్కు చట్టంపై హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరుగుతున్న శిక్షణ తరగతులకు సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు హాజరయ్యారు. రెండు రోజులపాటు ఇక్కడ జరుగుతున్న శిక్షణలో భాగంగా మొదటి రోజు సోమవారం సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు సంఘం నాయకులు వేణుమాధవ్, కోటిలింగం, రాజన్న, రాజయ్య హాజరయ్యారు. చట్టం ఉద్దేశం, నిబంధనలు, ఎలా సద్వినియోగం చేసుకోవాలనేదానిపై వివరించారు. ఈ సందర్భంగా వారు ఆ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాధవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

'డిసెంబర్ నుంచి వర్తింపజేయాలి'

నస్పూర్: సింగరేణి యాజమాన్యం ప్రవేశపెట్టిన స్పెషల్ ఇన్సెంటివ్ స్కీం డిసెంబర్ నుంచి అమలు చేయాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాజమాన్యం స్పెషల్ ఇన్సెంటివ్ స్కీం కేవలం ఫిబ్రవరి, మార్చి నెలలకు ఇవ్వడం సరికాదన్నారు. డిసెంబర్ నుంచి స్కీంను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విజిలెన్స్ పెండింగ్ కేసులు పరిష్కరించాలి

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగుల మారుపేర్ల పేరిట డిపెండెంట్స్‌ను విజిలెన్స్ విచారణతో ఉద్యోగాలు నిలిపివేసిన వారిని వెంటనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. విజిలెన్స్ పేరిట విచారణలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గోలేటి నుంచి కొత్తగూడెం వరకు చేపట్టిన పోరుయాత్ర సోమవారం మందమర్రికి చేరింది. ఈ సందర్భంగా మందమర్రి జీఎం ఆఫీస్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.

కంటి వైద్యశిబిరం

చెన్నూర్‌రూరల్: పట్టణంలోని జైహింద్ ఆఫీసర్స్ క్లబ్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. డాక్టర్ భాస్కర్ మాదేకర్ ఉదార నేత్రి వైద్యశాల రేకుర్తి కరీంనగర్ వారి సౌజన్యంతో బాధితులను పరీక్షించారు.